సాక్షి
జగిత్యాల

గురువారం । 9 । నవంబర్ । 2023



పదహారు భాషల్లో ఓటరు జాబితా

మీకు తెలుసా?

కరీంనగర్ అర్బన్: ఓటరు జాబితా 16 భాషల్లో ముద్రిస్తారు. ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన ఓటర్లలో 20శాతం మందికి పైగా అధికార భాష కాకుండా మరేదైనా భాష మాట్లాడుతూ ఉండి ఆ మైనార్టీ భాషలో అక్షరాస్యుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు వారి భాషలోనూ జాబితాను ప్రచురించి ప్రకటించాలని ఎన్నికల సంఘం ఆదేశిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో బ్యాలెట్ కూడా విభిన్న భాషల్లో ముద్రిస్తారు. దీనికి తోడు అన్ని మెట్రో నగరాల్లో ఓటరు జాబితాలను ఆంగ్లంలో సైతం ప్రచురిస్తారు. సర్వీసు ఓటర్ల జాబితాలో చివరి భాగం తప్పనిసరిగా ఆంగ్లంలోనే ఉంటుంది. ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆంగ్లం తోపాటు 16 భాషల్లో ఓటర్ల జాబితాను ప్రచురిస్తున్నారు.



‘అసెంబ్లీ’ వేదికన.. ఎడారి వేదన!

జంగ్ తెలంగాణ

ప్రవాసీ పాలసీయే అ‘జెండా’

- ఉమ్మడి జిల్లాలో 3.71 లక్షల వలసజీవుల ఓట్లు
- ఎన్నికల బరిలో గల్ఫ్ వాపసీలు
- నామినేషన్లకు సిద్ధమవుతున్న ఎన్నారైలు
- ఇప్పటికే ఇద్దరి నామినేషన్.. రెడీగా మరో ముగ్గురు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:


ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అందులోనూ ఉత్తర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కరువు తాండవించేది. అందుకే ఇక్కడి యువత గల్ఫ్ వలసలకు మొగ్గు చూపేవారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక వలసలు తగ్గినా.. గల్ఫ్‌లో చక్కటి ఉపాధి కోసం వెళ్లే యువతలో ఆసక్తి మాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో ఎడారి దేశాల్లో ఆకస్మిక మరణాలు, మరణించిన వారికి బీమా పరిహారం, అనారోగ్యం, తిరిగి వచ్చిన వారికి పునరావాసం, వ్యాపార సబ్సిడీలు, రాయితీలు వంటి వాటి కోసం ఒక విధానం ఉండాలని చాలాకాలంగా పోరాటాలు సాగుతున్నాయి. ఈసారి అసెంబ్లీ ఎన్నికలను తమ డిమాండ్ల సాధనకు వేదికగా ఎంచుకున్నారు. ఎన్నికల సాక్షిగా తాము బరిలో నిలిచి, తమ సాధకబాధకాలను లోకానికి తెలియజేస్తే.. కనీసం ఈ దఫా ప్రభుత్వంలోనైనా తమ బతుకులకు భరోసా దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 3.71 లక్షల గల్ఫ్ కుటుంబాల ఓట్లు ఉన్నాయి. వీరందరినీ ఏకతాటిపై తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

15 లక్షల మంది వరకు గల్ఫ్ వాపసీలు

గల్ఫ్ దేశాల్లో మన రాష్ట్ర కూలీలు 15 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. గత పదేళ్లలో ఎడారి దేశాల నుంచి మరో 15 లక్షల మంది వాపస్ వచ్చి, స్వగ్రామాల్లో సరైన ఉపాధి లేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. స్థానిక వనరులతో పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయ రంగానికి మద్దతు ఇస్తే వలస సమస్యలు కొంతవరకు తీరుతాయని వారి వాదన. రాష్ట్రంలో మొత్తం 32 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ కుటుంబాల ఓట్లు నిర్ణయాత్మకంగా మారతాయని ధీమాగా ఉన్నారు. అందుకే, వీరిలో రాజకీయ చైతన్యం రగిలించాలని, తద్వారా అనుకున్న డిమాండ్లు నెరవేర్చుకునేలా పలువురు గల్ఫ్ ఉద్యమకారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

నామినేషన్ల ద్వారా నిరసన

గల్ఫ్ కార్మికుల సమస్యలు, న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలని, వారిపై సానుభూతి ఉన్న ఓటర్లను తమవైపు తిప్పుకోవాలన్నది గల్ఫ్ ఉద్యమకారుల వ్యూహంగా కనిపిస్తోంది. ఈ అసెంబ్లీ ఎన్నికలను వేదికగా చేసుకొని, నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఇద్దరు నామినేషన్ వేయగా మరో మహిళ గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో వేసేందుకు సిద్ధమవుతున్నారు.



నామినేషన్లు వేసేది వీరే..

వేములవాడ: గుగ్గిళ్ల రవిగౌడ్
నిర్మల్: స్వదేశ్ పరికిపండ్ల
కోరుట్ల: చెన్నమనేని శ్రీనివాసరావు
సిరిసిల్ల: కృష్ణ దొణికెణి
ధర్మపురి: బూత్కురి కాంత

నోట్: వీరిలో వేములవాడ, నిర్మల్‌లో నామినేషన్ వేశారు. కోరుట్ల, సిరిసిల్ల, ధర్మపురిలో వేయాల్సి ఉంది.

సోషల్ మీడియా అస్త్రంగా..

గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రవాసులు ఈసారి రాష్ట్రంలోని గల్ఫ్ ఎన్నారైలు ఉండే 32 నియోజకవర్గాలను ప్రభావితం చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం సోషల్ మీడియాను అస్త్రంగా ఎంచుకున్నారు. వాట్సాప్, ఈఎంవో ఎఫ్‌బీ మెసెంజర్, ఇన్‌స్టా తదితర యాప్స్ ద్వారా తమ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి, గల్ఫ్ సంఘాల అభ్యర్థులకు ఓట్లు వేయించాలని కోరుతున్నారు.

ఎన్‌ఆర్‌ఐ పాలసీ తేవాలి



ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. వారి కోసం గల్ఫ్ బోర్డుతో కూడిన ప్రత్యేక ఎన్‌ఆర్‌ఐ పాలసీ తేవాలి. అక్కడ మరణించిన కుటుంబాల సంక్షేమం, తిరిగి వచ్చిన వారికి ఉపాధి, పరిశ్రమల ఏర్పాటుకు విధానం రూపొందించాలి. 32 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేసేలా గల్ఫ్ కుటుంబాలు ఉన్నాయి. మా గోడు ప్రభుత్వాలకు తెలిసేలా కామారెడ్డి నుంచి 100 మంది గల్ఫ్ విడోలు, నిర్మల్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల, వేములవాడ, సిరిసిల్ల నుంచి ఒక్కో విడోతో నామినేషన్ వేయించబోతున్నాం.

– మందా భీంరెడ్డి, గల్ఫ్ వలస వ్యవహారాల విశ్లేషకులు

న్యూస్‌రీల్

అంజన్న హుండీ ఆదాయం రూ.40లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీరాజరాజేశ్వర సేవా సేవాసమితి సభ్యులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం ఈవో వెంకటేశ్ ఆధ్వర్యంలో లెక్కించారు. 33రోజులకుగాను రూ.40,08,527, 27గ్రాముల మిశ్రమ బంగారం, రెండు కిలోల మిశ్రమ వెండి, 17 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపారు. లెక్కింపులో ఏఈవో శ్రీనివాస్, ఏస్సై శ్రీనివాస్, సూపరింటెండెంట్లు సునీల్, శ్రీనివాస శర్మ, దర్మేందర్, ఉమా మహేశ్వర్, జమున శ్రీనివాస్, శ్రీరాజ రాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు ఈనెల 10 నుంచి 14 వరకు సెలవు

జగిత్యాలఅగ్రికల్చర్: దీపావళి సందర్భంగా జిల్లాకేంద్రంలోని మార్కెట్‌కు ఈనెల 10 నుంచి 14 వరకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కల రాధ తెలిపారు. ఈనెల 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని, రైతులు గమనించాలని కోరారు.

జగిత్యాల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా కరుణాకర్



జగిత్యాలజోన్: జగిత్యాల స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా గంప కరుణాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన నియామక పత్రాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్ బుధవారం కరుణాకర్‌కు అందించగా.. బాధ్యతలు స్వీకరించారు. కరుణాకర్ నియామకంపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సీహెచ్.రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల నిబంధనలు కట్టుదిట్టంగా అమలు



చెల్‌గల్‌లో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం చెల్‌గల్ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం, నగదు రవాణా, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ జరుగుతుందన్నారు. ఓటర్లను ఎవరు ప్రలోభపెట్టినా కేసు నమోదు చేస్తామన్నారు. చెక్‌పోస్టుల సిబ్బంది వాహనాల తనిఖీని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న సత్యనారాయణ

మెట్‌పల్లి: విద్యుత్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపవద్దని ఎస్‌ఈ సత్యనారాయణ సూచించారు. పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో బుధవారం మెట్‌పల్లి, మల్లాపూర్ సబ్ డివిజన్ల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తరుచూ లైన్లను పరిశీలించాలని, ప్రతినెలా వందశాతం బిల్లులు వసూలు చేయాలని, ప్రధానంగా ఆన్‌లైన్‌లో చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు అవసరమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అందించడంలో జాప్యం చేయొద్దన్నారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది స్థానికంగా ఉంటూ మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఎస్‌ఏఓ తిరుపతయ్య, డీఈలు తిరుపతి, గంగారాం, రవీందర్, ఏఓ లక్ష్మణ్, ఏడీఈలు మనోహర్, నగేష్‌కుమార్ తదితరులున్నారు.

ఊపందుకున్న నామినేషన్లు

- కోరుట్ల నుంచి పది నామినేషన్లు
- జగిత్యాలలో 9.. ధర్మపురిలో ఏడు దాఖలు
- రేపటితో ముగియనున్న ప్రక్రియ

జగిత్యాల: జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. ఈనెల 3నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నా.. 7, 8, 9 తేదీల్లో మంచిరోజులు ఉండటంతో అభ్యర్థులు వేచి చూశారు. బుధవారం జగిత్యాల నుంచి తొమ్మిది నామినేషన్లు, కోరుట్ల నుంచి పది, ధర్మపురి నుంచి ఏడు దాఖలయ్యాయి. నామినేషన్లకు మరో రెండురోజులు మాత్రమే సమయం ఉండడంతో గురు, శుక్రవారాల్లో మరింత మంది అభ్యర్థులు దాఖలు చేసే అవకాశముంది. ఈనెల 13న నామినేషన్ల స్క్రూటినీ, 15వరకు ఉపసంహరణకు అవకాశముంటుంది. అదే రోజు మూడు నియోజకవర్గాల్లో ఎంతమంది బరిలో ఉన్నారో తెలియనుంది. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ నామినేషన్లు వేశారు.

కోరుట్ల నుంచి అత్యధికంగా పది

బుధవారం ఒక్కరోజే జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు 26 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో అత్యధికంగా కోరుట్ల నుంచి పదిమంది దరఖాస్తు చేసుకున్నారు. జగిత్యాల నుంచి 9, ధర్మపురి నుంచి ఏడు నామినేషన్లు వచ్చాయి. జగిత్యాలలో బీజేపీ నుంచి భోగ (బండారి) శ్రావణి రెండు సెట్లు దాఖలు చేశారు. బీఎస్పీ నుంచి బల్కం మల్లేశం, స్వతంత్రులుగా తూము తిరుపతి, సబ్బు జగన్ (రెండుసెట్లు), మహ్మద్ జమీల్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి భూక్య నందు, ధర్మ సమాజ్ పార్టీ నుంచి దుబ్బ చైతన్యకుమార్ దాఖలు చేశారు. కోరుట్ల నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ (నాలుగు సెట్లు), బీజేపీ నుంచి ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ నుంచి జువ్వాడి నర్సింగారావు, బీఆర్‌ఎస్ నుంచి కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ నుంచి పోతు నాగార్జున్, ప్రజాసేన పార్టీ నుంచి ఆకుల హన్మండ్లు, స్వతంత్ర అభ్యర్థిగా కొండ చంద్రమాణిక్యం నామినేషన్లు వేశారు.

ధర్మపురి నుంచి ఏడు

ధర్మపురి: ధర్మపురి నుంచి ఏడుగురు తమ నామినేషన్లను బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకరకు సమర్పించారు. వీరిలో బీజేపీ నుంచి సోగాల కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తరఫున వేముల రాజు, ఘన సురక్షపార్టీ నుంచి మోతె నరేశ్, బీఎస్పీ నుంచి నక్క విజయ్‌కుమార్, మహిళా ఎన్‌పవర్‌మెంట్ నుంచి జాడి ప్రేంకుమార్, స్వతంత్రులుగా కుంట నర్సయ్య, మేకల అక్షయ్‌కుమార్ తమ నామినేషన్లను దాఖలు చేశారు.

హలో తమ్మీ బాగున్నవా..!

- ఎన్నికల వేళ నూతన పలకరింపులు
- ప్రత్యేకంగా బర్త్‌డే శుభాకాంక్షలు



రాయికల్: అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్నడూ లేనివిధంగా పలుకరింపులు, శుభాకాంక్షలు చెప్పడం కొత్త ఆనవాయితీకి దారితీసింది. మరో 21 రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు ఎత్తుగడలు వేస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నడూ కలవని సామాన్య కార్యకర్తలు, ఇతర పార్టీల నాయకులను సైతం తమ వైపు తిప్పుకొనేందుకు ‘అన్నా.. బాగున్నావా.. ఈసారి జర నన్ను చూడే, ఒకసారి అవకాశం ఇవ్వవే.. మీకు రుణపడి ఉంటా..’ అంటూ పలుకరిస్తున్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ప్రతివార్డు, గ్రామంలోని ఎవరి బర్త్‌డే అయినా ముందుగా ఉదయం పూటనే అందరికంటే ముందుగా ఫోన్ చేసి బర్త్‌డే విషెష్ చెప్పడంతో ఎక్కడాలేని ప్రేమ సదరు నాయకుడికి కలగడం ఏంటని ఆశ్చర్యానికి గురవుతున్నారు. కాసేపాగి ఓహో ఇది ఎన్నికల వేళ కదా అందుకే నాకు విషెష్ చెప్పారని తమలో తామే నవ్వుకుంటున్నారు. ఎన్నడూ పలుకరించని నేత గుర్తుపెట్టుకుని శుభాకాంక్షలు చెప్పడం ఏంటని కొంతమంది బర్త్‌డే బాయ్‌లు ఆశ్చర్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా ఎన్నికల సందర్భంగా ఎక్కడాలేని చుట్టరికాన్ని కూడా కుదుర్చుకుంటూ సదరు చుట్టరికాలతో ఓట్లు పడేలా చేస్తున్నారు. ఏకంగా గ్రామాల్లో మాత్రం ఒకపార్టీకి చెందిన నాయకులు మరో పార్టీకి చెందిన నాయకులను జంప్ చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాకుండా తమ కులానికి సంబంధించిన వారంతా వ్యక్తికే ఓట్లు వేయాలని కుల రాజకీయాలు చేయడంలో పావులు కదుపుతున్నారు. ఏదేమైనా ఎన్నికల వేళలో కుల రాజకీయాలు బర్త్‌డే శుభాకాంక్షలు చెప్పడం, చుట్టరికాలు కలుపుకోవడం కొత్తరకం కలయికకు ఆనవాయితీగా ఏర్పడింది.

పోలీస్ సెల్యూట్ నో..



పెగడపల్లి: నిత్యం పోలీసుల భద్రత, సెల్యూట్లు, అధికారుల ప్రొటోకాల్ మధ్య ఉండే మంత్రులు, ఎమ్మెల్యేలకు అవి దూరమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడి కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచే ప్రొటోకాల్ నిబంధనలు వర్తించకుండాపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ముగ్గురు మంత్రులతోపాటు పది మంది ఎమ్మెల్యేలున్నారు. వారు పర్యటనకు వచ్చినప్పుడు గౌరవ వందనం, సెల్యూట్, ప్రొటోకాల్స్ తప్పనిసరి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అవి నిలిచిపోయాయి. పైలెటింగ్ సేవలు కూడా ఉండవు. ప్రభుత్వం కల్పించిన వ్యక్తిగత భద్రతా సిబ్బంది మాత్రం కొనసాగుతారు. ఎన్నికలు పూర్తయి ఎమ్మెల్యేలుగా గెలిచి కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ అధికారులు, పోలీసుల నుంచి రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక మర్యాదలుండవు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- జగిత్యాల రూరల్, రాయికల్‌లో విస్తృతంగా ప్రచారం
- బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుందన్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



సంజయ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న రాయికల్ మండలం మూటపల్లికి చెందిన యువకులు

జగిత్యాల: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంతోపాటు జిల్లా కూడా అభివృద్ధి బాటలో పయనిస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వేలాది మంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఎస్వీఎల్‌ఆర్ గార్డెన్‌లో బుధవారం జరిగిన ఆర్‌ఎంపీ, పీఎంపీ ఆత్మీయ సమ్మేళనంలో వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తనకు మరోసారి అవకాశమివ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కూసరి అనిల్, ప్రవీణ్, లవంగ రాజేందర్, తిరుపతి, రవీందర్ ఉన్నారు.

హన్మాజీపేట, కండ్లపల్లిలో ప్రచారం

జగిత్యాలరూరల్: మండలంలోని హన్మాజీపేట, కండ్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే సంజయ్ బుధవారం ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ చివరి వరకూ పోరాడి రాష్ట్రాన్ని సాధించారని, కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి బీళ్లను సాగుభూములుగా మార్చారని తెలిపారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని వివరించారు. కార్యక్రమాల్లో సర్పంచులు బొడ్డు దామోదర్, చంద రజిత, ఎంపీటీసీ ఆరె సౌజన్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లికి చెందిన 100 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ న్యాదెం రత్నమాల, మండల అధ్యక్షుడు బాల ముకుందం, నాయకులు శంకర్, ఆంజనేయులు, గంగారెడ్డి, రాజన్న, రాజేందర్ పాల్గొన్నారు.



యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

హ్యాట్రిక్ ఖాయం: జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ సతీమణి రాధికతో కలిసి కల్లెడలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆసరా, వితంతు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు, సర్పంచ్ మహేశ్వర్‌రావు, నాయకులు తిరుపతి, లక్ష్మణ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



ప్రచారంలో సంజయ్ సతీమణి, జెడ్పీచైర్‌పర్సన్

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

రాయికల్: బీఆర్‌ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మూటపల్లికి చెందిన 100 మంది, కట్కాపూర్‌కు చెందిన ఏబీవీపీ స్టేట్ కన్వీనర్ మల్లేశ్‌యాదవ్, పట్టణానికి చెందిన 30 మంది మైనార్టీ నాయకులు, బీజేపీ పట్టణ కార్యదర్శి కుర్మ ప్రేమ్‌రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌తోనే పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సర్పంచులు బెక్కం తిరుపతి, రాజమౌళి, కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, యూత్ అధ్యక్షుడు మోర రాంమూర్తి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



ప్రచారంలో పాల్గొన్న కల్వకుంట్ల సంజయ్



సంజయ్ తరఫున ప్రచారం చేస్తున్న తల్లి సరోజ

- టూరిస్టులను నమ్మితే అంతే..
- కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్

కోరుట్ల: అభివృద్ధి చేసిన వారిని ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం కోరుట్లలో నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలను రెవెన్యూ డివిజన్ కేంద్రాలుగా మార్చడంతోపాటు అవార్డులు సాధించిన మున్సిపాలిటీలుగానూ గుర్తింపు తెచ్చుకున్నాయని పేర్కొన్నారు. కోరుట్లలో వంద పడకల ఆసుపత్రి, రెండు పట్టణాల్లో మినీట్యాంక్ బండ్‌లు, సెంట్రల్ లైటింగ్, బీటీరోడ్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఘనత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు దక్కుతుందన్నారు. ఆయన చేసిన అభివృద్ధి పనులే తన విజయానికి బాటలు వేస్తాయన్నారు. పట్టణాలతో సమానంగా నియోజకవర్గంలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలను అభివృద్ధి పథంలో నిలిపామన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ.. అందరి మధ్య పుట్టిపెరిగిన తనను ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికలప్పుడే ఐదేళ్లకోసారి వచ్చి ప్రజలకు కనిపించే టూరిస్టు నేతలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. తన కుమారుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌ను ఆశీర్వదించాలని కోరారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్లు అన్నం లావణ్య, రనవేని సుజాత, కోరుట్ల పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశం, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు చీటి వెంకట్రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీద పవన్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటేయండి: సంజయ్ తల్లి సరోజ

మెట్‌పల్లి: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సతీమణి సరోజ కోరారు. పట్టణంలోని 18వార్డులో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విద్యాసాగర్‌రావు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, తన కుమారుడిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు సంజయ్‌కుమార్ నామినేషన్



జగిత్యాల: బీఆర్‌ఎస్ పార్టీ తరఫున జగిత్యాల అభ్యర్థిగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గురువారం ఉదయం 11 గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా రూట్‌మ్యాప్ తయారు చేశారు. మోతెలోని పార్టీ కార్యాలయం నుంచి సాయిబాబా గుడి బైపాస్‌రోడ్, కొత్తబస్టాండ్, టవర్‌సర్కిల్, గంజ్‌రోడ్, పాతబస్టాండ్, ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఇప్పటికే సంజయ్‌కుమార్ మున్సిపాలిటీల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన సతీమణి రాధిక, కుమార్తె హార్దిక నాయకులు, కార్యకర్తలను కలిసి నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు.

కోరుట్ల అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ ఆస్తులు రూ.54.96 కోట్లు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ బుధవారం నామినేషన్ వేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో తను బీజాపూర్‌లో ఎంబీబీఎస్, కర్ణాటకలో ఎంఎస్ చదివి హైదరాబాద్‌లో వైద్యుడిగా స్థిరపడినట్లు తెలిపారు. తన భార్య చెలిమెడ దీప్తి ఆస్తులతో కలిపి రూ.54.96 కోట్లుగా చూపారు. వారసత్వం, సొంతంగా సంపాదించుకున్న స్థిర చరాస్తులన్నీ కలిపి రూ.38.21 కోట్లుగా, తన వద్ద రూ.2.14 లక్షలు, అప్పులు రూ.3.42 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. సంజయ్ భార్య పేరిట రూ. 16.75 కోట్ల ఆస్తులు, రూ.6 లక్షల అప్పు, ఆమె వద్ద రూ.2.65 లక్షలు ఉన్నట్లు తెలిపారు.

మార్కెట్లోకి 98 ఇంచుల టీవీ



టీవీని ఆవిష్కరిస్తున్న సతీశ్‌కుమార్

జగిత్యాల: రాష్ట్రంలోనే మొదటిసారిగా సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్ 98 ఇంచుల క్యూలెడ్ టీవీని జగిత్యాలలో సామ్‌సంగ్ షోరూం స్మార్ట్‌ప్లాజాలో అందుబాటులో ఉంచినట్లు ప్రముఖ వైద్యుడు సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం సామ్‌సంగ్ ప్లాజాలో దీనిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగిత్యాలలో సైతం అన్ని సామ్‌సంగ్ బ్రాండ్‌లకు సంబంధించి అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదన్నారు. కార్యక్రమంలో కంపెనీ సేల్స్ మేనేజర్స్ శోభన్‌బాబు, యశస్వీ ఎలక్ట్రానిక్స్ అధినేత కోటగిరి శ్రీనివాస్, యశస్వి సామ్‌సంగ్ ప్లాజా సభ్యులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన నాయకునికే ఓటు

- ప్రలోభాలకు లొంగకూడదు • అబద్ధాల నేతకు ఓటు బంద్ • యువత మనోగతం



జగిత్యాల: రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు. ఈ హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకుంటేనే మెరుగైన సమాజం ఆవిర్భవిస్తుంది. 18 ఏళ్లు నిండిన యువతలో అవగాహన కల్పించిన అధికారులు.. ప్రతి ఒక్కరినీ ఓటరు నమోదు చేశారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో యువత ఓట్లు అధికంగానే నమోదయ్యాయి. ఈ క్రమంలో కొందరిని 'సాక్షి' పలుకరించి వారి మనోగతాన్ని తెలుసుకుంది. సమర్థవంతమైన నాయకుడినే ఎన్నుకోవాలని, నేతల అబద్ధాలు విని ఓటు వేస్తే ఇబ్బందులు తప్పవని, మంచి నాయకుడితోనే సుపరిపాలన సాధ్యమని వెల్లడించారు. అదే యువత భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందని తెలిపారు. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటామని చెప్పారు.

ఉచిత పథకాలొద్దు.. ఉద్యోగాలివ్వాలి



యువతకు ఉద్యోగాలు ఎంతో అవసరం. ఉచిత పథకాలు తీసేసి పేదలకు మెరుగైన వైద్యం, విద్య అందించాలి. రిజర్వేషన్లు, కులాలను బట్టి కాకుండా వారి ఆదాయం చూసి ఇవ్వాలి. రిజర్వేషన్లతో కొందరికి ఉద్యోగాలు వస్తుండగా ప్రతిభ ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది. సమర్థవంతమైన నేతను ఎన్నుకోవాలి.

– హర్షవర్ధన్, జగిత్యాల

ఓటు మార్పునకు నాంది కావాలి



ప్రజా సంక్షేమంతో పాటు, అభివృద్ధికి పాటుపడే నాయకుడికే ఓటు వేస్తా. ఓటు వజ్రాయుధం. అర్హులైన వారందరు ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తా. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి చేసే యువ నాయకులను ప్రోత్సహించాలి. అప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది.

– ఆత్మకూరి గణేశ్, జగిత్యాల

నిరుద్యోగులుగానే



ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ శాతం ఉన్నారు. ఎంతోమంది ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. విద్యాభివృద్ధిపై మార్పు తీసుకువచ్చే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకురావాలి. నిరంతరం విద్యార్థుల సమస్యల సాధన కోసం పాటుపడే నాయకుడిని ఎన్నుకోవాలి.– రోషిని, జగిత్యాల

ప్రజల్లో చైతన్యం తేవాలి



యువతీ, యువకులు తమ భవిష్యత్ కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. అప్పుడే అభివృద్ధి జరుగుతుంది. ఎన్నికల సమయంలోనే హామీలిచ్చి కనిపించని నాయకులను చట్టసభల్లో అడుగు పెట్టనివ్వొద్దు.

– కొర్రి జ్యోత్స్న, జగిత్యాల

ఆలోచించి వేయాలి



ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నో హామీలిస్తున్నాయి. ఆచరణలో అవి నెరవేరుతాయా లేదా అని ఆలోచించి ఓటు వేయాలి. ఒకసారి ఓటువేస్తే ఐదేళ్ల వరకు ఏమీ చేయలేం. ఓట్లకోసం హామీలివ్వగానే నమ్మొద్దు.

– కందుకూరి సాహిత్య, జగిత్యాల

మార్పు రావాలి



అంకితభావంతో పనిచేసే వ్యక్తికే పట్టం కట్టాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. పాలకులు తమ స్వార్థం కోసం కాకుండా ప్రజా సమస్యలు, విద్యా, వైద్యం అందించేందుకు ఆలోచించాలి. యువత తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి.

– మదీహ నిసంత్, జగిత్యాల

సమర్థవంతుడినే ఎన్నుకోవాలి



అసెంబ్లీలో విద్యార్థుల కోసం గళమెత్తే నాయకుడిని ఎన్నుకోవాలి. ఎన్నికల్లో యువత సమర్థవంతుడికే ఓటువేయాలి. దేశ భవిష్యత్ అంతా విద్యార్థులు, యువతపైనే ఆధారపడి ఉంది.

– వంశీ, జగిత్యాల

ప్రలోభాలకు లొంగొద్దు



ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకూడదు. ప్రతిఒక్కరూ ఓటువేసే ముందు ఆలోచించి వేస్తే ఓటు దుర్వినియోగం కాదు. ఒకవేళ ప్రలోభాలకు లొంగి ఓటువేస్తే ఐదేళ్ల పాటు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటువేయాలి.

– గుంట శృతిక, జగిత్యాల

రాయితీ దూరం.. విద్యార్థులకు భారం



పదో తరగతి విద్యార్థులు

- ఈ నెల 17 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు గడువు
- ఆదాయ సర్టిఫికెట్ సమర్పిస్తేనే రాయితీకి అవకాశం
- నిబంధనల ప్రకారం ఇవ్వలేకపోతున్న అధికారులు

గొల్లపల్లి: పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర విద్యాశాఖ కల్పిస్తున్న ఫీజు రాయితీ ఉపయోగ పడటం లేదు. వార్షిక పరీక్షల కోసం చెల్లించాల్సిన ఫీజుకోసం ప్రభుత్వం రాయితీ పథకం అమలు చేస్తుంది. అయితే ఇందులో ఉన్న నిబంధనల కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా ఈ పథకాన్ని అందుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 2023–24 విద్యాసంవత్సరానికి పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు షెడ్యూల్ విడదలైంది. అపరాధ రుసం లేకుండా ఈనెల 17 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంది. అపరాధ రుసుంతో డిసెంబర్ 20వరకూ అవకాశం కల్పించారు.

ఇచ్చేది తక్కువ.. ఖర్చు ఎక్కువ

వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు ఒక్కో విద్యార్థి రూ.125 ఫీజు చెల్లించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇందులో 100 శాతం రాయితీ పొందే అవకాశం ఉంది. అయితే ఆయా వర్గాల విద్యార్థులు ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వం చాలా ఏళ్లుగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నా.. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణప్రాంతాల వారికి రూ.20 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.25 వేలు మాత్రమే ఉండాలన్న నిబంధన ఉంది. అంతమొత్తంతో విద్యార్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపడం లేదు. రూ.125 ఫీజు రాయితీ కోసం ఆదాయ సర్టిఫికెట్ తీసుకునేందుకు ముందుగా మీసేవలో దరఖాస్తు ఫారం పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనికి ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ కోసం రెండుసార్లు మీసేవ కేంద్రాల చుట్టూ తిరగడానికి రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. ఫలితంగా వేలాది మంది ఈ రాయితీని వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

ఏటా 10వేల మందికి పైగా విద్యార్థులు

జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 416 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఏటా సుమారు 10వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా మార్చిలో వార్షిక పరీక్షలు రాయాల్సి ఉంటుంది. మొత్తం విద్యార్థుల్లో 70 శాతం మేర బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులే ఉంటారు. వీరంతా ఫీజు రాయితీ పొందే అవకాశం ఉన్నా.. ఆదాయ సర్టిఫికెట్ జారీలో నిబంధనలు సవరించకపోవడంతో ప్రభుత్వం కల్పించిన రాయితీని అందుకోలేకపోతున్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు ఆదాయ సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

లైన్‌మన్ సస్పెన్షన్

- మీటర్ ఏర్పాటుకు రూ.15వేలు లంచం
- సీఎండీకి బాధితుడి ఫిర్యాదు
- సస్పెండ్ చేస్తూ ట్రాన్స్‌కో డీఈ ఉత్తర్వులు

కోరుట్ల: మీటరు ఏర్పాటు చేయాలని అడిగితే రూ.15వేలు లంచం డిమాండ్ చేసినట్లు లైన్‌మన్‌పై ఓ వినియోగదారు సీఎండీకి ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సదరు లైన్‌మన్‌ను సస్పెండ్ చేస్తూ మెట్‌పల్లి ట్రాన్స్‌కో డీఈ తిరుపతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోరుట్ల పట్టణంలోని హాజీపురాలో అబ్దుల్ జమీర్, కాలిక్, సల్మాన్ ఇల్లు నిర్మించుకున్నాడు. మీటర్ కోసం ఆ ఏరియా ట్రాన్స్‌కో లైన్‌మన్ ఎల్.రవితేజకు దరఖాస్తు చేసుకున్నాడు. లైన్‌మన్ రవితేజ ఆ ఇంటిని పరిశీలించి ఇంటి నిర్మాణం పూర్తి కాలేదని, మీటర్ ఇవ్వరాదని దరఖాస్తును రిజెక్ట్ చేశాడు. ఇల్లు పూర్తిగా నిర్మించుకున్న తరువాత అబ్దుల్ జమీర్, కాలిక్, సల్మాన్, సలీం మళ్లీ మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండోసారి కూడా లోవోల్టేజీ సాకు చూపి దరఖాస్తు తిరస్కరించారు. దీంతో దరఖాస్తుదారులు ట్రాన్స్‌కో ఏఈ శ్యాంను కలిసి లైన్‌మన్ మీటర్ ఇవ్వమంటే రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని ఫిర్యాదు చేయగా.. ఆయన ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి మీటర్ ఇవ్వడంలో ఎలాంటి సమస్యలూ లేవని ధ్రువీకరించారు. అయినప్పటికీ లైన్‌మన్ రవితేజ తనకు లంచం కింద రూ.15వేలు ఇవ్వాల్సిందేనని వినియోగదారులను మరోసారి డిమాండ్ చేయడంతో వారు ట్రాన్స్‌కో సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ జరిపిన ట్రాన్స్‌కో మెట్‌పల్లి డీఈ తిరుపతి లైన్‌మన్ రవితేజను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై 'సాక్షి' ఏడీఈ అంజన్‌రావును సంప్రదించగా ధ్రువీకరించారు.

నాడు జెడ్పీటీసీలు.. నేడు ఎమ్మెల్యే బరిలో

- కథలాపూర్‌కు దక్కిన అరుదైన అవకాశం
- 2001లో అంబల్ల భాగ్యవతి.. ఈసారి ఎన్నికల్లో తుల ఉమకు చాన్స్



అంబల్ల భాగ్యవతి



తుల ఉమ

కథలాపూర్ (వేములవాడ): ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు సహజం. ప్రజాప్రతినిధులకు మాత్రం పదోన్నతులు ఉండవు. కానీ కథలాపూర్ జెడ్పీటీసీలుగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహిళా నేతలిద్దరికీ ఎమ్మెల్యేగా బరిలో నిలిచే అవకాశం రావడం విశేషం. మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన అంబల్ల భాగ్యవతి జెడ్పీటీసీగా పనిచేసి గతంలో ఎమ్మెల్యేగా బరిలో ఉన్నారు. బీమారం మండలం మోత్కురావుపేట గ్రామానికి చెందిన తుల ఉమ కథలాపూర్ జెడ్పీటీసీగా పనిచేసి ప్రస్తుతం ఎమ్మెల్యేగా బరిలో ఉంటున్నారు.

అప్పుడు భాగ్యవతి.. ఇప్పుడు తుల ఉమ

మండలంలోని భూషణరావుపేటకు చెందిన అంబల్ల భాగ్యవతి కథలాపూర్ జెడ్పీటీసీగా 1995 సంవత్సరం నుంచి 2000 వరకు, ఎంపీపీగా 1987 సంవత్సరం నుంచి 1992 వరకు పనిచేశారు. 2001లో బుగ్గారం నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి ద్వితీయ స్థానానికి పరిమితమయ్యారు. బీమారం మండలం మోత్కురావుపేట గ్రామానికి చెందిన తుల ఉమ 2014 సంవత్సరంలో కథలాపూర్ జెడ్పీటీసీగా గెలుపొంది ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా 2019 వరకు పనిచేశారు. ప్రస్తుతం వేములవాడ నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా తుల ఉమ బరిలో ఉంటున్నారు. మండలంలో మండలస్థాయి ప్రజాప్రతినిధులుగా సేవలందించినవారికి ఎమ్మెల్యేగా బరిలో ఉండే అవకాశం రావడంపై మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాజారాం తండాలో తడిచిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

అకాల వర్షం.. తడిచిన ధాన్యం

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం కురిసిన అకాలవర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచింది. రాజారాం తండా, దుంపేట, కథలాపూర్‌లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరిధాన్యం తడిచిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. కొందరు ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పారు.



దుంపేటలో ధాన్యం కుప్పలపై నిలిచిన వర్షపునీరు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని వేములకుర్తిలో మూడురోజుల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి యత్నించిన హనుమంతరావు (20) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన హనుమంతరావు భార్య కళావతితో కలిసి ఆరునెలలుగా వేములకుర్తిలోని కోళ్లఫారంలో పనిచేస్తున్నాడు. ఈనెల 4న ఇద్దరి మధ్య గొడవ జరగగా కళావతి తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన హనుమంతరావు పురుగుల మందుతాగాడు. గమనించిన తోటి కూలీలు మెట్‌పల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నగదు పట్టివేత



నగదు పట్టుకున్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్ : ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం మెట్‌పల్లి మండలం మారుతినగర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించగా కారులో రూ.లక్షా 79వేల నగదు పట్టుకొని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లవద్దని సూచించారు.

ప్రమాదకరంగా కాలువ గట్లు



ప్రమాదకరంగా మారిన కాలువ వెంట దారి

చొప్పదండి: మండల పరిధి లోని ఎస్సారెస్పీ ప్రధాన కాకతీయ కాలువ గట్టు ప్రమాదకరంగా మారాయి. కొన్నేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో చొప్పదండితో పాటు, ఆర్నకొండ, రెవెల్లి శివారు గుండా వెళ్లే కాకతీయ కాలువ గట్లపై ఎడమ వైపు ఉన్న దారి కుచించుకుపోతోంది. గట్టు వెంట గడ్డి పెరుగుతుండటంతో ప్రయాణికులకు దారి ఇరుకుగా మారుతోంది. గతంలో కాలువ పక్కన ఎత్తుగా మట్టి ఉండేది. దీంతో వాహనదారులు భయం లేకుండా ప్రయాణించేవారు. ప్రస్తుతం కాలువ గట్టుపై దారి ఒకవైపు మొక్కలు, చెట్లు పెరుగుతుండగా, మరోవైపు లోతుగా ఉండే కాలువ వైపు ఎత్తుగా మట్టి లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు



పట్టుకున్న మద్యం, నిందితులతో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

జగిత్యాలక్రైం: మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని జగిత్యాల ఎక్సైజ్ సీఐ ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్ వైపు వెళ్తున్న మంక్యానాయక్ తండాకు చెందిన ఇద్దరు నాటుసారా తయారీకి వాడే బెల్లం పానకాన్ని ద్విచక్రవాహనాలపై తరలిస్తుండగా పట్టుకున్నారు. వారినుంచి 80 కిలోల బెల్లం స్వాధీనం చేసుకోవడంతోపాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. కొత్తపేట వడ్డెరకాలనీకి చెందిన సూర రాజనర్సయ్య ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 11.04 లీటర్ల మద్యంతో పాటు, వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మంక్యానాయక్ తండా శివారులోని అటవీ ప్రాంతాల్లో 200 లీటర్ల బెల్లం పానకం, ఉప్పుమడుగు గ్రామ శివారులో వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. మద్యం రవాణాతోపాటు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. దాడుల్లో ఎస్సై మేఘమాల, సరిత, రవి ఉన్నారు.

మద్యం పట్టివేత

రామగుండం: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని బుధవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మల్యాలపల్లికి చెందిన సతీశ్ రామగుండంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి రూ.8వేలు విలువగల మద్యం కొనుగోలు చేసి ఇంటికి తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీజ్ చేసి సతీశ్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సుంకరి రమేశ్ తెలిపారు. ఇక్కడ ఎస్సై శారద, సిబ్బంది ఖదీర్, ప్రసాద్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో పదేళ్ల జైలు

జగిత్యాలజోన్: బాలికపై లైంగికదాడి చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.6వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు జడ్జి సుగలి నారాయణ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదుగంటి త్రిపుర కథనం ప్రకారం.. జిల్లాలోని సారంగాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక బహిర్భూమికి ప్రతిరోజూ ఆరుబయటకు వెళ్లేది. అదే గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు పురస్తుల నారాయణ బాలికపై కన్నేశాడు. ఒకరోజు పని ఉందంటూ హోటల్‌లోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. ఎవరికైనా చెబితే బాలికతోపాటు ఆమె అన్నను కూడా చంపుతానని బెదిరించాడు. బాలిక భయపడి ఎవరికీ చెప్పలేదు. దీనిని ఆసరాగా చేసుకున్న నారాయణ బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. కొద్దిరోజులు బాలిక బయటకు వెళ్లడం మానేసింది. బాలికకు పెద్దమ్మ వరుసైన బందెల లావణ్య 21 డిసెంబర్ 2016న బాలిక వద్దకు వచ్చి 'నారాయణతో ఎందుకు మాట్లాడుతలేవు.. నీకు సెల్‌ఫోన్ ఇచ్చిండు.. ఫోన్ చేస్తడు మాట్లాడు..'అని చెప్పి వెళ్లిపోయింది. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో నారాయణ బాలికకు ఫోన్‌చేసి బయటకు రప్పించి తన మోటర్ సైకిల్‌పై బలవంతంగా తీసుకెళ్లాడు. బాధితురాలు కేకలు వేయడంతో ఆదిలాబాద్ జిల్లా కడెం మండలం అంబారిపేటలో విడిచిపెట్టాడు. అదే గ్రామంలో తనకు తెలిసిన బంధువుల వద్దకు వెళ్లిన బాలిక జరిగిన విషయాన్ని వివరించింది. చెల్లెను తీసుకొచ్చిన ఆమె అన్న సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పురస్తుల నారాయణతో పాటు అతడికి సహకరించిన బందెల లావణ్యపై ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై పి.కరుణాకర్ ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ కె.భద్రయ్య దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, బి.రాజు, జి.రామకృష్ణలు సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి పురస్తుల నారాయణకు పదేళ్ల జైలు, రూ.6వేల జరిమానా విధించారు. లావణ్యపై నేరం నిరూపణ కాకపోవడంతో ఆమెపై ఉన్న కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
గురువారం ॥ 9-11-2023



ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మానాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ–బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మాటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి.
- నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది.
- వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి
- నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు
- నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు
- ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి



'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు.

ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో' పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది.

'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.

ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.